ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts
సంపుటి - 02 సంచిక -347 పేజీలు - 8 వెల - 03/- శనివారం 4 ఏప్రిల్ 2026

# వైసీపీది నాశనం మాది శాసనం



## సిఆర్‌డిఏ గుర్తించిన ప్రాంతమంతా రాజధానే
## 2028 నాటికి ప్రధాన పనులు కొలిక్కి
## వైసిపివి కుట్రలు, కుతంత్రాలు
## మీడియా సమావేశంలో సిఎం చంద్రబాబునాయుడు

**అమరావతి ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

పార్లమెంటు ఆమోదించిన ఈ చట్ట సవరణకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తరువాత అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఏ) గుర్తించిన ప్రాంతమంతా రాజధాని కిందే వస్తుందన్నారు. పార్లమెంటులో అమరావతి బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో సిఎం ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన పరిణామాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజధాని ఏర్పాటు, మూడు రాజధానుల బిల్లు, అమరావతి రైతుల ఉద్యమం వంటి వాటిని వివరించారు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన



తొలి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు. అందుకే చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు.

మిగతా 2లో.



# తిరుగులేని శక్తి ఐఎన్ఎస్ తారాగిరి

## నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం
## అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం
## విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**విశాఖపట్నం,ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి,

మిగతా 2లో.



# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

## వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా అడ్డుకట్ట
## అసోం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

**గువాహటి,ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్ధవంతంగా

మిగతా 2లో.

# విదేశీ మందులపై 100 శాతం సుంకం..

## ట్రంప్ కీలక ఆదేశాలు-భారత కంపెనీలపై దీర్ఘకాలిక ప్రభావం?
## దేశీయ భద్రత, సరఫరా వ్యవస్థ సమస్యలే ఈ నిర్ణయానికి కారణమన్న వైట్‌హౌస్
## ప్రస్తుతానికి జెనరిక్, బయోసిమిలర్ ఔషధాలకు మినహాయింపు

**ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫార్మా రంగంపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశీయ భద్రత, సరఫరా వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలను కారణంగా చూపుతూ.. విదేశాల నుంచి దిగుమతి అయ్యే కొన్ని పేటెంట్ ఔషధాలపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికాలోనే మందుల తయారీని ప్రోత్సహించడమే ఈ నిర్ణయం

మిగతా 2లో.



# మరింత చమురు కావాలా...

## మేం సరఫరా చేస్తాం!
## : భారత్‌కు రష్యా ఓపెన్ ఆఫర్



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్న వేళ, భారత్‌కు రష్యా కీలకమైన ప్రతిపాదన చేసింది. దేశీయ అవసరాల కోసం క్రూడ్ ఆయిల్, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్ జీ) సరఫరాను మరింత పెంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. భారత పర్యటనలో ఉన్న రష్యా మొదటి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఈ మేరకు హామీ ఇచ్చారు.

మిగతా 2లో.



# మాపై వివక్ష చూపారు

## : ఉపరాష్ట్రపతికి వైసీపీ ఎంపీల ఫిర్యాదు
## అమరావతికి చట్టబద్ధత బిల్లును ఆమోదించిన పార్లమెంట్
## రాజ్యసభలో తమకు 5 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చారన్న వైసీపీ ఎంపీలు
## అమరావతి రైతులకు జరిగే న్యాయంపై బిల్లులో స్పష్టత లేదని విమర్శ

**అమరావతి ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

రాజధాని అమరావతి బిల్లుపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో తమకు సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని వైసీపీ ఎంపీలు ఆరోపించారు. రాజ్యసభలో తమ పార్టీకి ఏడుగురు ఎంపీలు ఉన్నప్పటికీ, కేవలం 5 నిమిషాలు మాత్రమే సమయం ఇచ్చారని వారు ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు.

మిగతా 2లో.

# అత్యంత అందంగా భూమి..

## అద్భుతమైన ఫోటో విడుదల చేసిన నాసా



2లో.

# 2047 నాటికి తెలంగాణ టెక్స్‌టైల్ రాజధాని

## టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డిహామీ
## తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచమంతా ధరించేలా చేస్తామన్న రేవంత్
## సినిమా పరిశ్రమ అవసరాలను స్థానికంగా తీర్చేలా ప్రోత్సాహం
## నాణ్యమైన పత్తి, మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలమని వెల్లడి



# నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

## రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాలు
## వెల్లడించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

**కాకినాడ,ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది.. నేటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు

మిగతా 2లో.



# మాపై వివక్ష చూపారు

**మొదటిపేజీ తరువాయి**

అదే సమయంలో కేవలం ఇద్దరు ఎంపీలు ఉన్న తెలుగుదేశం పార్టీకి మాత్రం 20 నిమిషాల సమయం కేటాయించడాన్ని వారు తప్పుబట్టారు.తాము అమరావతికి వ్యతిరేకం కాదని, కానీ తమపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు జరిగే న్యాయంపై ఎటువంటి స్పష్టత లేదని వారు పేర్కొన్నారు. గుంటూరు - మచిలీపట్నం కారిడార్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయాలని జగన్ కోరిన విషయాన్ని వారు ఉపరాష్ట్రపతికి వివరించారు.చట్టసభల్లో తమ గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని, సంఖ్యాబలం ఉన్న పార్టీలకు తగిన సమయం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. రాజధాని విషయంలో తాము సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

# నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

**మొదటిపేజీ తరువాయి**

.ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు ..

----------

# మరింత చమురు కావాలా...

## మేం సరఫరా చేస్తాం!: భారత్‌కు రష్యా ఓపెన్ ఆఫర్

**మొదటిపేజీ తరువాయి**

ఏప్రిల్ 2న ఢిల్లీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో మంటురోవ్ సమావేశమయ్యారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీతో కూడా భేటీ అయ్యారు. ఈ చర్చల్లో ఇంధన రంగంలో ద్వైపాక్షిక సహకారం ప్రధాన అంశంగా నిలిచింది. "భారత మార్కెట్‌కు స్థిరంగా చమురు, ఎల్ఎన్‌జీ సరఫరాను పెంచే సత్తా తమ కంపెనీలకు ఉంది" అని మంటురోవ్ స్పష్టం చేసినట్లు రష్యా అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది.

పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమవడంతో, ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా సరఫరాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రష్యా ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఇటీవలి గణాంకాల ప్రకారం, జనవరి 2026లో రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు 19.3 శాతానికి తగ్గాయి. అయితే, ఫిబ్రవరి చివరి నుంచి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైన తర్వాత భారత్ మళ్లీ రష్యా నుంచి కొనుగోళ్లను పెంచుతోంది. ఇంధనంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, ఎరువులు, కనెక్టివిటీ వంటి ఇతర రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించడంపై ఈ సమావేశాల్లో చర్చించారు. గతేడాది భారత్‌కు ఎరువుల సరఫరా 40 శాతం పెంచామని, భవిష్యత్తులోనూ అన్ని విధాలా సహకరిస్తామని మంటురోవ్ తెలిపారు.రష్యా తాజా ప్రతిపాదన భారత్ ఇంధన భద్రతకు భరోసా ఇవ్వడంతో పాటు, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

**మొదటిపేజీ తరువాయి**

అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# 2047 నాటికి తెలంగాణ టెక్స్‌టైల్ రాజధాని

## : సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు.

టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు.

హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# విదేశీ మందులపై 100 శాతం

**మొదటిపేజీ తరువాయి**

వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఈ పరిణామం ప్రపంచ ఫార్మా మార్కెట్‌తో పాటు, భారత కంపెనీల భవిష్యత్తుపైనా ఆందోళన కలిగిస్తోంది.

**కొత్త ఆదేశాలు ఏం చెబుతున్నాయి?**

ట్రంప్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం విదేశాల నుంచి దిగుమతి అయ్యే పేటెంట్ లేదా బ్రాండెడ్ ఔషధాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు వర్తిస్తాయి. అయితే, అమెరికా ప్రభుత్వంతో "మోస్ట్ ఫేవర్డ్ నేషన్" ధరల ఒప్పందం కుదుర్చుకుని, అమెరికాలో తయారీ యూనిట్లను నిర్మిస్తున్న కంపెనీలకు సుంకాల నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. ధరల ఒప్పందం చేసుకోకపోయినా, అమెరికాలో తయారీ ప్రాజెక్టులు చేపడుతున్న కంపెనీలకు 20 శాతం సుంకం విధిస్తారు. నాలుగేళ్లలో ఈ సుంకం 100 శాతానికి పెరుగుతుంది. ఒప్పందాలు చేసుకోని పెద్ద కంపెనీలకు 120 రోజులు, ఇతర కంపెనీలకు 180 రోజుల గడువు ఇచ్చారు. ఈ లోపు ఒప్పందాలు చేసుకోకపోతే 100 శాతం సుంకాలు అమల్లోకి వస్తాయి. ఇప్పటికే 17 ప్రముఖ ఫార్మా కంపెనీలతో ధరల ఒప్పందాలు కుదిరినట్లు, వాటిలో 13 కంపెనీలు సంతకాలు చేసినట్లు వైట్‌హౌస్ అధికారులు తెలిపారు.

ప్రస్తుతం అమెరికాలో పంపిణీ అవుతున్న పేటెంట్ ఔషధాల్లో దాదాపు 53 శాతం విదేశాల్లోనే తయారవుతున్నాయని, కేవలం 15 శాతం యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అవుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడితే, ప్రాణాలను రక్షించే మందుల కొరత ఏర్పడవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. క్యాన్సర్, అరుదైన వ్యాధులు, ఆటో ఇమ్యూన్ సమస్యల చికిత్సలో వాడే కీలక ఔషధాల కోసం దేశీయంగానే పటిష్ఠమైన తయారీ వ్యవస్థ ఉండాలని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది.

**భారత్‌పై ప్రభావం ఎంత?**

ప్రస్తుతానికి ఈ ఆదేశాల వల్ల భారత ఫార్మా రంగానికి తక్షణ ముప్పు లేదు. ఎందుకంటే, జెనరిక్ మందుల తయారీలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ట్రంప్ ఆదేశాల నుంచి జెనరిక్స్, బయోసిమిలర్స్, అత్యవసర మందులకు మినహాయింపు ఇచ్చారు. దీంతో అమెరికాకు తక్కువ ధరకే మందులను ఎగుమతి చేస్తున్న భారత కంపెనీల వ్యాపారం యథావిధిగా కొనసాగనుంది. అయితే, దీర్ఘకాలంలో దీని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. పేటెంట్ మందులు, ఏపీఐలపై భారీ సుంకాలు విధించడం వల్ల భవిష్యత్తులో పెట్టుబడులు అమెరికాకు తరలిపోయే ప్రమాదం ఉంది. భారత్ వంటి తయారీ కేంద్రాల నుంచి కంపెనీలు తమ కార్యకలాపాలను అమెరికాకు మార్చేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. అంతేగాక ఏడాది తర్వాత జెనరిక్ దిగుమతులపై కూడా జాతీయ భద్రత కోణంలో సమీక్ష జరుపుతామని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. ఇది అమలైతే కాంప్లెక్స్ జెనరిక్స్, స్పెషాలిటీ ఇంజెక్టబుల్స్, బయోసిమిలర్స్‌పై ప్రభావం పడుతుంది. డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా, బయోకాన్ వంటి భారతీయ కంపెనీలు అమెరికాలో పేటెంట్ మందులను విక్రయిస్తున్నందున, భవిష్యత్తులో ధరల ఒత్తిడిని లేదా మరిన్ని నిబంధనలను ఎదుర్కోవచ్చు.

# తిరుగులేని శక్తి ఐఎన్ఎస్ తారాగిరి

**మొదటిపేజీ తరువాయి**

ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.



149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శుత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

# వైసీపీది నాశనం మాది శాసనం

**మొదటిపేజీ తరువాయి**

పార్లమెంటులో ఒక్క వైసిపి మినహా అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయని అన్నారు. చట్టబద్ధత బిల్లును వైసిపి వ్యతిరేకించిందని, దేశంలోని అన్ని పార్టీలూ ఒకవైపు ఉంటే వైసిపి మాత్రం మరోవైపు నిలిచిందని విమర్శించారు. రాజధాని నిర్మాణం ఒక్క రోజులోనే పూర్తయ్యేది కాదని, నిరంతరం జరిగే ప్రక్రియ అని అన్నారు. క్రమానుగుణంగా నిర్మాణం, అభివృద్ధి జరుగుతాయని చెప్పారు. కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలతోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. హైదరాబాద్ ఒక్కటే తెలంగాణలో గరిష్ట ఆదాయాన్ని ఆర్జించి పెడుతోందన్నారు.

మౌలిక సదుపాయాల నిర్మాణం పూర్తయితే అభివృద్ధి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రస్తుతం రూ.56 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని, ప్రధాన పనులను 2028 నాటికి ఒక స్థాయికి తీసుకొస్తామన్నారు. పూర్తయిన పనులను 2029లో ప్రధాని మోడీతో ప్రారంభిస్తామని చెప్పారు. అమరావతితోపాటు తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నీటి భద్రత తీసుకొస్తామన్నారు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని, దీనికి చోదకశక్తిగా రాజధాని అమరావతి నిలుస్తుందని పేర్కొన్నారు. శాశ్వత రాజధానిగా అమరావతిని పార్లమెంటు చట్టం చేస్తే దానిని కూడా మార్చేస్తామని వైసిపి నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూడు రాజధానులు ఫెయిలవ్వడంతో మావిగన్ అంటూ ప్లాన్ బిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని విమర్శిం చారు. రాష్ట్ర విభజన కంటే, జరిగిన నష్టం కంటే, వైసిపి పాలనలో విధ్వంసం ఎక్కువ జరిగిందని ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం వేతనాలకే సరిపోతోందని, కేంద్రం ఇస్తున్న నిధులతో అప్పులకు వడ్డీలు చెల్లించడానికే సరిపోతుందని, నిర్వహణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతు ఇస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్రం కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా గ్యాస్ వంటి సమస్యలొచ్చాయని తెలిపారు. సరఫరా వ్యవస్థ దెబ్బతిని ధరలు పెరిగే అవకాశం ఉందని, ఇలాంటి సంక్షోభాలను ఎంత సమర్ధవంతంగా ఎదుర్కోగలమనేది కీలకమన్నారు. అమరావతి అజేయం, శాశ్వతం, అన్‌స్టాపబుల్ అని, దీనికి అడ్డంకి కలిగించాలని చూస్తే వారివి పగటి కలలుగానే మిగిలిపోతాయని పేర్కొన్నారు.

# ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలి

**గత ప్రభుత్వంలో లాగా చేస్తామంటే కుదరదు**

**సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి నిమ్మల రామానాయుడు**


**అమరావతి, ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.** గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చు కోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు . శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటివరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్ధిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబందించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



# అత్యంత అందంగా భూమి...

## అద్భుతమైన ఫొటో విడుదల చేసిన నాసా

**హైదరాబాద్ ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**



అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా, భూమికి చెందిన ఒక అద్భుతమైన చిత్రాన్ని విడుదల చేసింది. చంద్రుడి వైపు ప్రయాణిస్తున్న ఆర్టెమిస్-2 వ్యోమగాములు, తమ ఒరియన్ క్యాప్సూల్ కిటికీ నుంచి ఈ హై-రిజల్యూషన్ ఫోటోను తీశారు. ప్రస్తుతం ఈ చిత్రం సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకుంటోంది.ఈ ఫోటోలో భూగోళం మొత్తం నీలి, గోధుమ రంగులతో ప్రకాశవంతంగా కనిపిస్తోంది. వాతావరణంలో ఏర్పడిన ఆకుపచ్చని అరోరా కూడా ఈ చిత్రంలో స్పష్టంగా కనువిందు చేస్తోంది. ఈ చిత్రాన్ని పంచుకుంటూ నాసా ఒక స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇచ్చింది. "చంద్రుడి వైపు మా వ్యోమగాములు ప్రయాణిస్తుంటే, మనమంతా కలిసి వారిని చూస్తున్నాం. ఈ చిత్రంలో కనిపిస్తున్నది మనందరి ఇల్లు, మన భూమి" అని నాసా తన పోస్టులో పేర్కొంది.మానవులను తిరిగి చంద్రుడిపైకి పంపేందుకు నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్టెమిస్ కార్యక్రమంలో భాగంగా ఆర్టెమిస్-2 మిషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# చేనేత రంగానికి ప్రభుత్వం వరం

**నేతన్నల మోములో దరహాసం**

**41వేల మంది వినియోగదారులకు లబ్ధి**

**ప్రభుత్వ సబ్సిడీ యేటా రూ. 25.56 కోట్లు**

**ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి**

**రిపబ్లిక్ సంక్షేమం, ఏప్రిల్ 03, తిరుపతి**
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి చేయూతనందిస్తోంది. అల్పాదాయంతో తమ జీవితాలను నెట్టుకొస్తున్న నేతన్నలకు సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వరాన్ని ప్రసాదించింది. ప్రభుత్వ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. దేశంలో వ్యవసాయం రంగం తర్వాత ఎక్కువగా ఆధారపడే రంగంగా చేనేత రంగం ప్రసిద్ధిగాంచింది. ఈ రంగంలో రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షలకు పైగా నేతన్నల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.
కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కీలకమైన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ యేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం



అమలులోకి వచ్చింది. మగ్గంపై వస్త్రాలు నేసే నేతన్నలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాల నేతన్నలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును సరఫరా చేయడం జరుగుతుంది.

### అభివృద్ధే లక్ష్యంగా ఏపీఎస్పీడీసీఎల్ కృషి

సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్య సాయి జిల్లాల్లో 29,075 హ్యాండ్ లూమ్స్ సర్వీసులు, 11,971 పవర్ లూమ్స్ సర్వీసులు ఉన్నాయి. మొత్తం మీద ఈ పథకం ద్వారా ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 41,046 మంది నేతన్నలు విద్యుత్ బిల్లుల కోసం యేడాదికి చెల్లించాల్సిన రూ. 25.56 కోట్లు మొత్తాన్ని సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. సంస్థ పరిధిలో నేతన్నల విద్యుత్ సర్వీసులకు మెరుగైన సేవలందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ కృషి చేస్తోంది. నేతన్నల విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతోంది. మగ్గాలు, పవర్ లూమ్స్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ లోడ్ కు అనుగుణంగా ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్ సర్వీసులకు కెపాసిటర్ల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు అనుగుణంగా నేతన్నల అభివృద్ధే లక్ష్యంగా ఏపీఎస్పీడీసీఎల్ కృషి చేస్తోంది.

# శివాజీపూలే అంబేద్కర్ జయంతి వారోత్సవాలను జయప్రదం చేద్దాం

**-ఏప్రిల్ 8 నుంచి 14 వరకు వైభవంగా నిర్వహణ**

**- ర్యాలీలు, సమావేశాలు, సినిమా ప్రదర్శన**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 3)**కర్నూలు నగరంలో ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లెనిన్ బాబు, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, డా. కంచర్ల హరిప్రసాద్ (బిఎఎంసిఇఎఫ్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు), ఆర్టీఐ జయన్న తెలిపారు. శుక్రవారం స్థానిక సిఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జయంతి వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం, హక్కుల కోసం జీవితాలను అర్పించిన మహనీయుల జయంతులను ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుతూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 8 నుండి 14 వరకు జరిగే ఈ వారోత్సవాల్లో భాగంగాఏప్రిల్ 8: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం నుండి డ్రైవర్స్ అసోసియేషన్ హాల్ వరకు ర్యాలీ, అనంతరం సమావేశం. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ దేవరాజ్ మహారాజ్ పాల్గొననున్నారు. ఏప్రిల్ 11: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు టీజీవి కళాక్షేత్రం (సి క్యాంపు)లో పూలే సినిమా ప్రదర్శన. ఏప్రిల్ 14: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సాయంత్రం 4:30 గంటలకు పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ నుండి యునాని హాస్పిటల్ వరకు ర్యాలీ, అనంతరం సమావేశం. ఈ కార్యక్రమాల్లో ప్రజాసంఘాల నాయకులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయుల చరిత్రను తెలుసుకొని భవిష్యత్ తరాలకు అందించాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సి. మహేష్, ఏఐటీయూసీ నగర నాయకులు చంద్రశేఖర్, రామాంజనేయులు, నాగరాజు (బి ఎఎంసిఇఎఫ్ జిల్లా కన్వీనర్) తదితరులు పాల్గొన్నారు.


# "అమరావతి సంబరాలు- రాయలసీమ బాధలు!"

**ఇది గెలుపా, లేక మరోసారి ద్రోహమా?**

**వి.వి. నాయుడు**

**రాయలసీమ యువజన పోరాట సమితి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 3)**
అమరావతిని "5 కోట్ల ఆంధ్రుల గెలుపు"గా ప్రకటిస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. కానీ అదే సమయంలో రాయలసీమలో మాత్రం కరువు, వలసలు, నిరుద్యోగం యథాతథంగా కొనసాగుతున్నాయి.
ఒక వైపు సంబరాలుఁ మరో వైపు జీవన పోరాటం ఇదే నేటి వాస్తవం. ఈ గెలుపులో రాయలసీమ స్థానం ఎక్కడ?
"రెండు పార్టీల రాజకీయాలుఁ రాయలసీమకు నష్టం"
ఒక పార్టీ అమరావతి పేరుతో అభివృద్ధిని ఒకే ప్రాంతంలో కేంద్రీకరిస్తోంది. మరో పార్టీ మూడు రాజధానుల పేరుతో ఆశలు చూపించి, కర్నూలుకు ఇచ్చిన హామీలను నిలబెట్టలేదు. ప్రభుత్వాలు మారాయి నాయకులు మారారు
కానీ రాయలసీమ దురదృష్టం మాత్రం మారలేదు.
చివరికి రెండు పార్టీల రాజకీయాల్లో నష్టపోయింది రాయలసీమ మాత్రమే. "దశాబ్దాలుగా ప్రాజెక్టులు పెండింగ్ఁ"
రాయలసీమలో దశాబ్దాలుగా కొనసాగుతున్న నీటి ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు. కొత్త ప్రాజెక్టులు ప్రారంభించే సంకల్పం కూడా కనిపించడం లేదు. రైతుకు




నీరు లేదుయువతకు ఉద్యోగాలు లేవుప్రాంతానికి భవిష్యత్తుపై నమ్మకం లేదు. "ఉద్యమాలు అందరివిఁ లాభాలు కొందరివి"ఒకప్పుడు నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కోసం "ఆంధ్రుల ప్రాజెక్టు" అంటూ అందరిని ఉద్యమాల్లో భాగం చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కోసం రాష్ట్రం మొత్తం పోరాడింది. శ్రీశైలం డ్యాం కోసం రాయలసీమ ప్రజలు తమ భూములు కోల్పోయారు. కానీ చివరికి? ప్రయోజనాలు కొందరికేరాయలసీమకు మాత్రం న్యాయం జరగలేదు. "ఇది అభివృద్ధి కాదు ప్రాంతీయ ద్రోహం"అందరి పేరుతో ఉద్యమాలు చేయించి, చివరికి లాభాలు ఒకే ప్రాంతానికి మళ్లిస్తే అది అభివృద్ధి కాదు. అది బలవంతుల రాజకీయ ప్రయోజనం.
రాయలసీమను అవసరమైనప్పుడు ఉపయోగించుకుని, తర్వాత పక్కన పెట్టే ఈ విధానాన్ని ప్రశ్నించే సమయం వచ్చింది. "రాయలసీమ ప్రజల గళం"మాకు సంబరాలు కాదుమాకు నీరు కావాలిమాకు ఉద్యోగాలు కావాలిమాకు న్యాయం కావాలిరాయలసీమ లేకుండా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అసంపూర్తి. అని వి.వి. నాయుడు అన్నారు.

# ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**-శిలువలో పలికిన ఏడు మాటలు గురించి వివరణ**

**--శాంతి, దయ, కరుణ, ప్రేమతో ఒకరినొకరు కలిగి ఉండాలి**

**డివిజనల్ చైర్మన్ రెవరెండ్ పాస్టర్ వేదనాయకం**



**మంత్రాలయం, ఏప్రిల్ ,3, (రిపబ్లిక్ న్యూస్ ):** లోకకల్యాణం నిమిత్తం మనుష్య కుమారుడైన యేసుక్రీస్తు సిలువయాగం చేశారని సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ డివిజన్ చైర్మన్ వేదనాయకం బాబు, గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే పండుగను పురస్కరించుకొని మంత్రాలయం, కల్లుదేవకుంట, సుగురు, చెట్నేహళ్లి, ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం యేసుక్రీస్తు సిలువలో ప్రాణం పెట్టారని, తద్వారా మానవాళి రక్షింపబడ్డారని గుర్తు చేశారు. 40 రోజులు క్రీస్తు అనేక శ్రమలకు ఓర్చి శుభ శుక్రవారం న మధ్యాహ్నం 3 గంటలకు సిలువలో ప్రాణం విడిచి లోకానికి విముక్తి కలిగించారని, స్పష్టం చేశారు. సిలువలో వ్రేలాడుతూ పలికిన క్షమించుట, పరదైసు, బాధ్యత, చెయ్యి విడిచితి వి. దప్పికొనుచున్నాను. సమాప్తము, ఆత్మార్పణ, అను ఏడు మాటలను వివరించి చెప్పారు. ప్రతి ఒక్కరు క్రీస్తులోని గుణాలను అలవర్చుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో ఆయా చర్చల నందు సంఘ పెద్దలు క్రైస్తవ సోదరులు యవ్వనస్తులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**: ఎంపీ బస్తిపాటి నాగరాజు -రూ.45 లక్షలతో నిర్మించిన మైనార్టీ షాధిఖానా ప్రారంభం**

**టీ.జీ. వెంకటేష్ సేవలను ప్రశంసించిన ఎంపీ**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 3)**
కర్నూలు జిల్లా రూరల్ మండలంలోని ఈ.తాంద్రపాడు గ్రామంలో మైనార్టీల సంక్షేమం మరియు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీ.జీ. వెంకటేష్ స్వంత నిధులతో రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మైనార్టీ షాధిఖానాను ఆయన టీ.జీ. వెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ నాగరాజు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో పురోగతి సాధించేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. టీ.జీ. వెంకటేష్ కుటుంబం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రశంసించిన ఆయన, ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్త పరిశ్రమలు స్థాపించబడుతున్నాయని, దీని ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అన్నారు.
అంతకుముందు గ్రామంలో టీ.జీ. వెంకటేష్ తల్లి గౌరమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కూడా ఎంపీ నాగరాజు ప్రారంభించారు.

# కర్నూలులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై కఠిన చర్యలు

**అక్రమ పార్కింగ్, రహదారి ఆక్రమణల తొలగింపు - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**



**కర్నూలు క్రైమ్(రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 3)**
కర్నూలు నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు కర్నూలు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు డిఎస్పీ జె.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మరియు మునిసిపల్ కార్పోరేషన్ సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిసరాల్లో వాహనదారులు, పాదచారులకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ సిఐ శ్రీ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు రహదారులను ఆక్రమించిన తోపుడు బండ్లు, అనధికారిక పార్కింగ్‌లు మరియు ఇతర అడ్డంకులను తొలగించారు. ఈ సందర్భంగా ప్రజలు, వ్యాపారస్తులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రహదారులపై వాహనాలను అడ్డంగా నిలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



# అపరిచితులతో డిజిటల్ లావాదేవీలకు దూరంగా ఉండండి

## : కర్నూలు ఎస్పీ హెచ్చరిక

**ఏటీఎంల వద్ద అప్రమత్తంగా ఉండాలి**

**-ఫోన్‌పే, గూగుల్‌పే పేరుతో మోసాలపై ప్రజలకు కీలక సూచనలు**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 3)**
కర్నూలు జిల్లా ప్రజలు డిజిటల్ లావాదేవీల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ సూచించారు. అపరిచిత వ్యక్తులు, తెలియని వ్యక్తులతో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ఏటీఎం కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



ఏటీఎంల వద్ద సహాయం పేరుతో దగ్గరకు వచ్చే అపరిచితులను నమ్మవద్దని, "మేము ఫోన్‌పే లేదా గూగుల్‌పే చేస్తాం మీరు నగదు ఇవ్వండి" లేదా "మీరు ఆన్‌లైన్‌లో పంపండి మేము డబ్బు ఇస్తాం" వంటి మాటలతో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి మోసాలకు లోనైతే, దొంగల అక్రమ లావాదేవీల వల్ల బాధితుల బ్యాంక్ ఖాతాలు కూడా ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉందన్నారు.
ప్రజలు నేరుగా బ్యాంకులు లేదా ఏటీఎంల ద్వారా మాత్రమే లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. అలాగే ఏటీఎం కార్డులు మార్పిడి చేసి డబ్బులు దోచుకునే ఘటనలు పెరుగుతున్నాయని హెచ్చరించారు.
ప్రజలు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ తెలిపారు. ఏటీఎంల వద్ద అపరిచితుల సహాయం తీసుకోకూడదని, తెలియని వ్యక్తులతో డిజిటల్ లావాదేవీలు చేయకూడదని, బ్యాంక్ వివరాలు మరియు ఓటిపి లను ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా **www.cybercrime.gov.in**–ల వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఒక గంటలోపు ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ వివరించారు. కర్నూలు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సోమయాజులపల్లెలో పట్టాదార్ పాస్‌బుక్‌ల రైతులకు పంపిణీ

### ఎమ్మార్వో విద్యాసాగర్



**ఓర్వకల్ ప్రతినిధి, ఏప్రిల్03,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**కర్నూలు జిల్లా, ఓర్వకల్ మండలం పరిధిలోని సోమయాజులపల్లె గ్రామంలో పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి,వీ=ూ విద్యాసాగర్, ఎ=ూ బాలమద్దిలేట్టి , పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి మరియు సర్పంచ్ జయమ్మ హాజరయ్యారు. అలాగే ఇతర రైతులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులు ఆకుల కొండయ్య, కుమ్మరి నాగేంద్రమ్మ, ప్రతాప్ తదితరులు హాజరై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.రైతు బెస్త లక్ష్మీ దేవి, పంట సీజన్ ప్రారంభానికి ముందే పాస్‌బుక్‌లు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు

## అమ్మవారి సేవలో ఇద్దరూ శాసనసభ్యులు



**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 03 రిపబ్లిక్ న్యూస్**

ప్రముఖ శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని ఇద్దరు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. శుక్రవారం రాహుకాల అభిషేకం అనంతరం పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిలు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలత ఉప కమిషనర్ ఈవో ఏకాంబరం వారిని ఆలయ మర్యాదలతో సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు .మండపంలో వేద ఆశీర్వాదం అనంతరం కుంకుమార్చన లో పాల్గొన్నారు.అమ్మవారి మెమొంటో పాటు తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సింగిల్ విండో చైర్మన్ హరి రాయల్, కార్తీక్, విద్యాసాగర్ ,బోయకొండ సుబ్బు, సోము, రెడ్డి ,సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నాయకులు బిజెపి తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ స్వయం సహాయక సంఘాల కల సాకారం

### నేడు గ్రామైక్య భవన స్లాబ్ పూర్తి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 3 ( రిపబ్లిక్ న్యూస్)**

హత్నూర మండల పరిధిలోని కొడిప్యాక గ్రామం లో శుక్రవారం నాడు మహిళా గ్రామైక్య భవనానికి స్లాబ్ వేయడం జరిగింది. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభ ప్రత్యేక అధికారి హోదాలో వెళ్లినా సిసి మహేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామ సంఘానికి నూతన భవనాలు మంజూరు చేసిందని, స్వయం సహాయక మహిళలకు ఈ భవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు, మండలంలోనే కొడిప్యాక గ్రామైక్య సంఘం నిర్మాణం లో ముందు వరుసలో నిలిపిన కాంట్రాక్టర్ ను అభినందించారు. నిర్మాణం జరుగుతున్న పని ప్రదేశంలో సర్పంచ్ మాధవి బాబు యాదవ్,సిసి మహేష్,విఒ అధ్యక్షురాలు మంగమ్మ,విఒఎ చంద్రశేఖర్ పాల్గొన్నారు

## పోలీసుల లాటి లాక్కొని మహిళపై దాడి చేసిన నాయకుడు

### తీవ్రంగా ఖండించిన స్థానికులు.



**ఓబులవారిపల్లి ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై లైంగిక ఆరోపణలు చేసిన మహిళలపై జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర పోలీసుల చేతి లోని లాటిని లాక్కొని దాడి చేశారు. ఈ ఘటనను స్థానిక ప్రజలు తీవ్రంగా ఖండించారు కులం పేరుతో మరియు పత్రికలలో వ్రాయలేని భాషలో ఆమెను దూషిస్తూ పోలీసుల చేతిలోని లాఠీ లాక్కొని కొట్టడం, తరుముతూ అరాచకం సృష్టించారు. ఈ ఘటన గురువారం రాత్రి రైల్వే కోడూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు..అమరావతి రాజధాని బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం తెలిపిన సందర్భంలో సంబరాల కోసం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మరి కొందరు పట్టణంలోని ప్రధాన రహదారిపైకి వచ్చారు. అదే సందర్భంగా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన ఉద్యోగిని, ఆమె న్యాయవాది ఆజాద్ సాయికృష్ణ సోదరుడు గోపితో కలిసి టోల్‌గేట్ వద్దనున్న పూల దుకాణాల వద్దకు వచ్చారు. ఇంతలో ఎమ్మెల్యే కారు, కార్యకర్తలు అటుగా వచ్చారు. ఆమెను అక్కడ చూసిన జనసేన నాయకులు తీవ్ర ఆగ్రహంతో ఆమె వెంట పడ్డారు. స్థానికులు చూస్తుండగా, పోలీసులు అడ్డుకుంటున్నా లెక్కచేయకుండా దాడి చేశారు. గోపీని కొడుతూ ఊరు వదిలి వెళ్లిపోవాలంటూ హెచ్చరిస్తూ రోడ్డుపైన పరిగెత్తించారు. ఎందుకు దాడి చేస్తున్నారంటూ ఆమె ప్రశ్నిస్తున్నా.. సమాధానం చెప్పకుండా.. తాతంశెట్టి నాగేంద్ర పోలీసుల చేతిలోని లాఠీ తీసుకుని ఆమెపై దాడి చేశారు. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న ఓ విలేకరిని సైతం కొట్టి వీడియో ఫుటేజ్‌ను డిలీట్ చేశారు. ఈ ఘటన జరుగుతున్నంతసేపూ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అక్కడే ఉన్నారు. స్థానికులు సంఘటనపై తీవ్రంగా స్పందించారు ఒక మహిళపై ఇంత దుర్మార్గంగా అన్యాయంగా దౌర్జన్యంగా పోలీసుల సాక్ష్యంగా పోలీసుల చేతి లాటిని లాక్కొని మహిళపై దాడి చేయడం మహిళా తరపు లాయర్ సోదరుడు ఆమె వెంట ఉన్న వ్యక్తి ఇద్దరినీ అరాచకంగా తరిమితరిమి పాపం శెట్టి నాగేంద్ర వారి కార్యకర్తలు కొట్టడం అన్యాయమని విలేకరిపై చేయి చేసుకుని కెమెరా లాక్కొని చిత్రీకరించిన వీడియోను అంతా డిలీట్ చేయడం దుర్మార్గమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించాలని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని స్థానిక ప్రజలు అన్నారు

# డప్పు వాయిస్తున్న దళితుడిపై స్పీకర్ దాడి

# సీఎం గారు చర్యలు తీసుకోండి

### రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య డిమాండ్.

**ఓబులవారిపల్లి ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

శ్రీరామనవమి ఉత్సవాల్లో డప్పు వాయిస్తున్న దళిత కళాకారుడుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆ కళాకారుడుపై చెంప మీద చేయి చేసుకోవడం దుర్మార్గమైన చర్యని దీనిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ కదిరిగాళ్ల నల్ల శాంతయ్య శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఎంతో గౌరవప్రదమైన హుందాగా ఉండవలసిన రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పదవిలో ఉండి వీధి రౌడీలా అన్యాయంగా ఒక దళితుడిపై చేయి చేసుకోవడం హేయమైన చర్య అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు నాయకుడు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఈ విషయంపై మానవతా దృక్పథంతో ఆలోచించి దళితుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని, స్పీకర్ పదవి నుంచి తొలగించాలని చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని శాంతయ్య ఈ సందర్భంగా వారిని కోరారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులపై పేదలపై దాడులు ఎక్కువయ్యాయని మొన్న డిప్యూటీ స్పీకర్ గా ఉన్న రఘురామ కృష్ణం రాజు ఉండి నియోజకవర్గం మాలపల్లి సంఘటనలో 50 మంది దళితులపై



అన్యాయంగా దుర్మార్గంగా కేసు పెట్టించడం స్పీకర్ గా వారికి తగున ఆ పదవికే వారు అనర్హులు స్పీకర్ పదవికి కళంకితలు, నిన్న తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం రాఘవరాజపురం ప్రజాదర్బాలలో కంప్లైంట్ చేయడానికి వచ్చిన మహిళను సాయంత్రం టోల్గేట్ వద్ద ఆమెపై దాడి చేసి కులం పేరుతో దూషించి మహిళ అని కూడా చూడకుండా జనసేన నాయకుడు కొట్టడం పోలీసుల లాఠీ తీసుకొని వారి ముందే ఆ మహిళను కొట్టడం దుర్మార్గం రాజకీయ రౌడీలా దళిత మహిళ పై ఇంత దుర్మార్గమా సమాజం ఎటు పోతుంది ఇదా ప్రజాస్వామ్యం ఇదా! ప్రజాపాలన? ప్రేక్షక పాత్రలు పోలీసులు ప్రజలు కట్టిన పన్నులతో జీతాలు తీసుకుంటూ ప్రజాసేవ చేయకుండా రాజకీయ రౌడీలకు అండగా పోలీసులు వ్యవహరించడం రాజ్యాంగానికి మాయని మచ్చ ఆని ఇది పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయంలో పోలీసులపై చర్య తీసుకోవాలన్నారు ముఖ్యమంత్రి గారు స్పందించండి గౌరవప్రదమైన పదవిలో ఉండి అరాచకాలకు పాల్పడుతున్న స్పీకర్లు డిప్యూటీ స్పీకర్లను పదవి నుంచి తొలగించండి స్పీకర్ పదవిలో రౌడీలు ఉండకూడదు ఆ పదవికి ఒక గౌరవం హుందా తనం ఉంది దానిని మీరు కాపాడండి రాష్ట్రంలో దళితుల పై దాడులు వారిపై అక్రమ కేసులు ఎక్కువయ్యాయి మీ పాలనలో ప్రజలకు శాంతి భద్రతలు లోపించాయని ఉదాహరణలు మీ కళ్ళముందే ఎన్నో ఉన్నాయని కళ్ళు తెరవండి ప్రజలకు శాంతిభద్రతలు కల్పించండి ఈ అరాచకాలు ఆపండి అని శాంతయ్య కోరారు,ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో దళితులందరూ, ప్రజా సంఘాలు, రాజ్యాంగ హక్కులను కాపాడే మేధావులు అందరూ కలిసి, ఏకమై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేసి కూటమి ప్రభుత్వం చేసే తప్పులను ఎండగడతామన్నారు,దాడి చేసినటువంటి నాయకులను దోషులుగా శిక్షించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాంఅన్నారు.

## నేరాల నియంత్రణ భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు

### ఎస్సై మహేష్ నాయుడు.

**ఓబులవారిపల్లి ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు,రవాణా అదుపు దృష్ట్యా ఓబులవారిపల్లి మండలం, ముక్కవారిపల్లి క్రాస్ రోడ్డు, కొర్లకుంట క్రాస్ రోడ్డు లో భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల అమర్చడం జరిగినదని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఓబులవారిపల్లి మహేష్ నాయుడు శుక్రవారం తెలియజేశారు , కడప చెన్నై జాతీయ రహదారిలో జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, డి.ఎస్.పి, వై శ్రీనివాసరావు పర్యవేక్షణలో, రైల్వేకోడూరు రూరల్ సీఐ డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ సీసీ కెమెరాలు అమర్చినట్టు ఎస్సై మహేష్ నాయుడు తెలిపారు, దాతల సహకారంతో ఈ సిసి కెమెరాలు అమర్చినట్లు ఆయన తెలిపారు,

కడప చెన్నై జాతీయ రహదారిహైవేపై పెరుగుతున్న వాహన రాకపోకల రద్దీ , రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణ,అదుపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని అందులో భాగంగా ఈ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు . ఈ కెమెరాల ద్వారా వాహనాల



కదలికలను పర్యవేక్షించడం, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, ప్రమాదాల సమయంలో తగు చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందన్నారు .

ఈ సందర్భంగా ప్రజలు కూడా భద్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని, అనుమానాస్పద వ్యక్తులను, ప్రమాదకర సంఘటనలను చూసినప్పుడు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. అదేవిధంగా ప్రజలు తమ ఇళ్లకు, దుకాణాలకు కూడా సీసీటీవీ కెమెరాలను అమర్చుకోవడం ఎంతైనా అవసరం అని పోలీసులు సూచించారు.




## ఐఏఎస్ అధికారిణి కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్...!

### తనకు నెగెటివ్ వచ్చిందన్న నటి హేమ

**హైదరాబాద్ ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

హైదరాబాద్‌లోని కొండాపూర్ క్వాక్ ఏరీనా పబ్‌లో డ్రగ్స్ కలకలం చెలరేగింది. 64 మందికి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి గంజాయి పాటిజివ్, ఇద్దరికి డ్రగ్స్ పాటిజివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన ఎనిమిది మందిలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా ఐఏఎస్ అధికారి కుమారుడు కూడా ఉన్నారని తెలుస్తోంది. పోలీసులు వీరిని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. క్వాక్ ఎరీనా పబ్ డ్రగ్ కేసులో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

క్వాక్ ఎరీనా క్లబ్‌లో 'బ్లాక్ కాఫీ' పేరిట ఈవెంట్ జరిగింది. ఈవెంట్‌లో దాదాపు 1,500 మంది పాల్గొన్నారు. ఈ సమయంలో అక్కడకు వచ్చిన ఈగల్ టీమ్ అధికారులు డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. 'బ్లాక్ కాఫీ' ఈవెంట్ జరుగుతున్న చోటుకు వెళ్లి పరీక్షలు నిర్వహించగా ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చింది.





**నటి హేమకు నెగిటివ్**

క్వాక్ ఎరీనా క్లబ్ పబ్ ఈవెంట్ లో ప్రముఖ సినీ నటి హేమ కూడా పాల్గొన్నారు. పరీక్షల్లో ఆమెకు నెగిటివ్ వచ్చింది. తనకు డ్రగ్ పరీక్షల్లో నెగిటివ్ వచ్చినట్లు నిర్ధారించిన కిట్‌ను ఆమె చూపిస్తూ వీడియో విడుదల చేశారు.

## పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు

### మాజీమంత్రి పేర్ని నానిపై పోలీస్ కేసు



**మచిలీపట్నం ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**

మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. గురువారం మచిలీపట్నం కొబ్బరి తోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటన నేపథ్యంలో పోలీసులపై మాజీ మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారు. చిలకలపూడి సీఐ పరమేశ్వరరావును బాడీ షేమింగ్ చేస్తూ అవమానించారు. అంతేకాకుండా పోలీసులను బెదిరించారు. పోలీసుల పట్ల మాజీ మంత్రి వ్యవహరించిన తీరుపై కృష్ణా జిల్లా పోలీస్ అధికారుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్న మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పందించిన పేర్ని నాని పోలీసులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎవ్వరినీ వదలమని, తమ ప్రభుత్వం వచ్చాక అంతు చూస్తామంటూ పోలీసులను ఉద్దేశించి పేర్ని నాని వ్యాఖ్యలు చేశారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 3 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయంలిఅని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ , సంఘ నాయకులు యాదగిరి,తో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూలి దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని తెలిపారు. అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు.ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. సమాజంలో



న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మహనీయులను కులం, వర్గం అనే పరిమితుల్లో చూడకుండా వారి ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో , బీ.సీ సంఘాల ప్రతినిధులు, ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# కవిత పార్టీ టీఆర్ఎస్ అవుతుందా?

### పాతపార్టీతో కొత్తగా వస్తామనడంలో ఆంతర్యం -రాజకీయ వర్గాల్లో ఇప్పుడు ఈ విషయమై చర్చ

**హైదరాబాద్, ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.** తెలంగాణ రాజకీయాల్లో కవిత తెలవిగా అడుగులు వేస్తున్నట్లుగా ఉంది. టిఆర్ఎస్ పార్టీని పునరుద్దరించుకోవడం ద్వారా రాజకీయంగా సులువుగా ప్రజల్లోకి వెళ్లడానికి మార్గం సుగమం చేసుకుంటున్నారని ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. కెసిఆర్ వదులుకున్న టిఆర్ఎస్‌నే సొంతం చేసుకుని తెలంగాణ శక్తిగా ఎదగాలని చూస్తున్నట్లు అర్థం అవుతోంది. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఖాళీగా ఉందని.. దానిని ఎవరైనా వాడుకోవచ్చునని చెప్పారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తోందన్నారు. పార్టీ ఆవిర్భావం రోజు.. అమరవీరుల స్తూపం వద్దకు వెళ్తామని పేర్కొన్నారు. తాను స్థాపించ బోయే పార్టీకి పాత పేరు.. కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం ప్రకటించారు. అలాగే టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉందని కూడా అన్నారు. దీనిని బట్టి కవతి పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి అవుతుందన్న ఊహాగానాలు వస్తున్నాయి.



ఇకపోతే తమకు ప్రధాన శత్రువు అధికార కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో కల్వకుంట్ల కవిత ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ పార్టీ ప్రొ. జయశంకర్ సిద్దాంతాల ప్రకారమే నడుస్తుందన్నారు. తమ పార్టీకి బిహార్ సిద్దాంతకర్త ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని పేర్కొన్నారు.

గుంపు మేస్త్రీ గుంట నక్కలు దోస్తులంటూ సీఎం రేవంత్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై కవిత పరోక్ష విమర్శలు చేశారు. సిద్ధిపేట అసెంబ్లీ నియోజకవర్గం మహిళా రిజర్వేషన్‌గా చేస్తే.. ఆ స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగుతానన్నారు. గజ్వేల్ మహిళా రిజర్వేషన్ వచ్చినా పోటీ చేసే అంశాన్ని ఆలోచిస్తానని తెలిపారు. సీఎం రేవంత్.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసి ఆ పార్టీని ఓడించారని.. అలాగే ప్రస్తుతం కేరళలో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీని ఓడిస్తారని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అంటున్నారని.. కానీ అసలు సిటీని చంపకుంటే చాలని కవిత చరకలంటించారు. మొత్తంగా కవిత రాజకీయ పార్టీ బహుశా టిఆర్ఎస్ అవుతుందని భావించాలి. అయితే ఈ పార్టీని పొందడం అంత సులువేనా అన్నది మున్ముందు చూడాలి. ఈ నెల 26న పార్టీ పేరును, ఎజెండాను ప్రకటిస్తామని కవిత ఇప్పటికే తెలిపారు. ఒకవేళ టిఆర్ఎస్ పేరు దక్కితే బిఆర్ఎస్ ఉనికికి ప్రమాదం ఏర్పడినట్లే.

# ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

### పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం -ఈదురుగాలులు కూడా ఉంటాయని హెచ్చరిక

**అమరావతి, ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుందని, ఆయా జిల్లాల యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది.వర్షంతో పాటు గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని సూచించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ



శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు స్థానిక అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరో వైపు తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

### పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం -నిధులు సమకూర్చాలని సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్ ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**
తెలంగాణ రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే.. ఈ




నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని, నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరం లోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం పండగల ప్రగతి పాలన ప్రజాపాలన.

### 4వార్డు కౌన్సిలర్ తిరుమల కల్పన హరికృష్ణ గౌడ్.




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 3 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 4వ వార్డులో ప్రగతిపాలన ప్రజా పాలన భాగంగా 99 ప్రణాళికల భాగంగా వార్డులో సమావేశం ఏర్పాటు చేశారు. వార్డు సమస్యలు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ కార్డు, రైతు భరోసా, పలు పథకాల కౌన్సిలర్ తిరుమల కల్పనా హరికృష్ణ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ నిధులు అవకతవకలు.

## ఎంపీడీవో కు వినతి పత్రం అందజేసిన గ్రామ ప్రజలు.

### పంచాయతీ సెక్రటరీ పై వెంటనే చర్య తీసుకోవాలి



**ఆందోల్ నియోజకవర్గ ప్రతినిధి ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
టేక్మాల్ మండల్ తంప్లూర్ పంచాపంచాయతీ నిధులు అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామ నాయకులు ఎంపీడీవో కు వినతిపత్రం సమర్పించారు. గ్రామపంచాయతీ నిధులను కార్యదర్శి దుర్వినియోగం చేస్తున్నారని గ్రామసభలో ఖర్చులకు సంబంధించిన లెక్కలు చూపకుండా నిరక్షంగా వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు మండిపడ్డారు. ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోకపోతే ప్రజా వానిలో కలెక్టర్ వినతిపత్రం అందజేస్తామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, యాదయ్య, శ్యామల ,రమేష్, నాగయ్య, మౌలానా, తదితరులు వినతి పత్రం అందజేశారు

# అంబేద్కర్ ,బాబు జగ్జీవన్ రామ్ మహానీయుల జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి.

### దళిత రత్న అవార్డు గ్రహీత శాఖమూరి యాదగిరి హోళియదాసరి డిమాండ్

**మెదక్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 3 ( ప్రజా రిపబ్లి క్ న్యూస్ )**
భారతదేశం మొదటి ఉప ప్రధాని సంఘసంస్కర్త సామాజిక న్యాయం కోసం అనేక పోరాటాలు రాజకీయంగా నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి వేడుకలు , భారత రత్న డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా ప్రతి గ్రామపంచాయతీలో , మండలం లో, నియోజకవర్గం లో , జిల్లా కేంద్రం లో జయంతి ఉత్సవాలు,వేడుకలు కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు ,జిల్లా కలెక్టర్ గారికి పత్రిక ప్రకటన ద్వారా ప్రకటించారు, మరియు డా.బాబు జగ్జీవన్ రామ్ గారికి భారత రత్న అవార్డు ఇవ్వాలని, డా.బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఓం శ్రీ మెడికల్ షాప్ ( గతంలో డా.అంజిరెడ్డి హాస్పిటల్ ముందర) ఉండెను కనుక అక్కడనే ఏర్పాటు చేయాలని హోళియదాసరి హక్కుల పోరాట సమితి



రాష్ట్ర అధ్యక్షుడు శాఖమూరి యాదగిరి హోళియదాసరి డిమాండ్. అలాగే డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ను నర్సాపూర్ పట్టణం లో నర్సాపూర్ X Road చౌరస్తా లో గతం లో ఉన్న స్థలం లోనే వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# అల్మాయిపేట గ్రామంలో చాకలి మల్లేశం అనిత కుమార్తె వివాహానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజన్న

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 3 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో ఏప్రిల్ 3 శుక్రవారం నాడు జరిగిన చాకలి మల్లేశం అనిత గార్ల కుమార్తె వివాహానికి శ్రీ లక్ష్మి దేవి ఫంక్షన్ హాల్ లో జరిగినటువంటి వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజన్న మరొక అతిథి అల్మాయపేట గ్రామ మాజీ సర్పంచ్ బుడ్డోల్ల రవిశంకర్ హాజరై కార్యక్రమాల్లో ముందుండి నిలవడానికి ఇలాంటి ఎన్నో నిదర్శనాలు కనుక గ్రామంలో జరిగిన ఈ వివాహానికి పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివాహ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు





ప్రజా రిపబ్లిక్



# ట్రంప్‌కు జ్ఞానోదయం అయ్యేనా ?

**ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**
పిల్లికి చెలగాటం..ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఇప్పుడు అమెరికా, ఇరాన్‌ల యుద్ధం తయారయ్యింది. ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..ఇరాన్ కోలుకోలేకుండా చేయడమే లక్ష్యంగా ట్రంప్ మూర్ఖంగా ముందుకు సాగుతున్నారు. ట్రంపం ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ఇంటాబయటా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకముందు ప్రపంచంలో ఇంధన కొరత తీవ్ర రూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తుంది. ఇంధన కొరత అన్ని దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిగురించి ట్రంప్‌కు పెద్దగా బెంగ లేదు. ప్రజలు ఏమయితే ఏమిటన్న ధోరణిలో ఆయన యుద్ధాన్ని ప్రేరేపించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఏమి జరిగినా అది మన ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవాలా వద్దా అన్నంత ప్రభావం చూపుతోంది. ఇప్పటికే మనదేశంలో హోటల్ పరిశ్రమ కుదేలయ్యింది. ఇలాగే యుద్ధం కొనసాగితే దాని ప్రభావం ఎన్నాళ్లు ఉంటుందో చెప్పలేం.ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టి ఇరాన్÷-ను దెబ్బతీసినందుకు గాను ఇరాన్ కూడా గట్టిగానే ఎదురిస్తోంది. అంతు చూస్తామని అమెరికాను హెచ్చరి స్తోంది. తమకు నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా మీద ఇరాన్ చేసిన దాడిని తక్కువగా అంచనా వేయటం తగదని అమెరికా పూర్వ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌కు హితవు పలుకుతున్నాడంటే ఇక పైనైనా ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పడమే! అత్యంత అధునాతన ఎఫ్ 35 యుద్ధ విమానంపై ఇరాన్ దాడి చేసిందన్న వార్త ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురిచేసింది. యుద్ధ తంత్ర నిపుణులు ఇరాన్ బలిమి లెక్కింపులో అమెరికా వ్యూహాన్ని తప్పుపట్టారు. తాజా వ్యూహంలో హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు సడలించేందుకు ట్రంపు నానా యాతన పడుతున్నారు. అది సాధ్యం కావడం లేదు. ఇరాన్ తో సత్సంబంధాలు నెరపుతున్న భారత్ వంటి దేశాల నౌకలకే సేఫ్ ప్యాసేజ్ లభించింది. అయినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చమురు సంక్షోభంలో భారత్ కూడా చిక్కుకోక తప్పడంలేదు. కొన్ని నౌకలు భారతీయ పోర్టులకు చేరినా దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత బ్లాక్ మార్కెట్, రవాణా




వాహనాలు చార్జీలు పెంపు వంటి అంశాల నుంచి ఎప్పటికి సాధారణ స్థాయికి చేరుకుంటుందో చెప్పలేం. హర్మూజ్ జలసంధి ఇరాన్ పట్టు నుంచి తప్పించడానికి వెళ్తున్న యుద్ధ విమానాలకు శ్రీలంక అనుమతి నీయకపోవడంతో అమెరికా ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. హర్మూజ్ పై సైనిక చర్యకు ముందుకు రాని నాటో కూటమి దేశాలతో, తమ భద్రతను తామే ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ చేతులెత్తేశారు. ఆయన నిర్ణయాలకు మిత్ర దేశాల వత్తాసు లభించడం లేదు. ఇరాన్ వార్ కారణంగా ఖతార్ ఎల్ఎన్జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు దారి దొరికే పరిస్థితి లేదని తేలిపోయింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం మానవ రహిత కార్యాచరణగా సాగుతోంది. కేవలం ఆయా దేశాల మౌలిక వనరుల విచ్ఛిత్తి పైనే దాడిగా చెప్పుకోవాలి. నెల రోజులుగా జరుగుతున్న యుద్ధాన్ని విశ్లేషిస్తున్న వారెవరైనా ఈ యుద్ధం ఆగేందుకు దారి లేదని, ఆపేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని వారి వైఖరులే స్పష్టపరుస్తున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డిగో గారియాను ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో అమెరికాలో కలవరం బయలుదేరింది.

ఇరాన్ వద్ద ఇలాంటి శక్తివం తమైన బాంబులున్నట్లు అంచనా వేయడంలో అమెరికా దాదాపు విఫలమైనట్లే. ఇప్పుడు అమెరికా ఆత్మరక్షణలో పడిపోయింది. అయినా ట్రంప్ తన అహంకారాన్ని వీడడం లేదు. యురేనియం శుద్ధి చేసే సామర్థ్యం ఇరాన్‌కు లేదని, అలాగే బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సామర్థ్యం కూడా లేకుండా చేసి తాము విజయం సాధించినట్లేనని ఈ మధ్యనే ఇజ్రాయిల్ ప్రధాని బెంజి మెన్ నెతన్యాహు ఒక సందర్భంలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర తయారీ వరకు వెళ్లకుండా చేయడమే తమ అంతిమ లక్ష్య మని అమెరికా ఇజ్రాయిల్ ప్రకటించుకున్నాయి. అదే నిజమైతే ఇప్పుడు వాళ్ళు ఆ దిశగా విజయం సాధించినట్లే. ఇజ్రాయిల్ లక్ష్యం అదే అయినప్పుడు మరికొంత కాలం యుద్ధాన్ని సాగతీయడం ఉభయులకూ, ఈ ప్రపంచానికీ మంచిది కాదు. టెహ్రాన్‌పై అమెరికా- ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది. ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు. అమెరికా- ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. అమెరికా- ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా అమెరికాను ఎదిరించే సాహసం ఇరాన్ చేస్తోంది. ఇది అమెరికాకు ముఖ్యంగా ట్రంప్‌కు గుణపాఠం కావాలి.

# మరో మూడు రోజులు పార్లమెంట్

## 16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం -మహిళా రిజర్వేషన్ ,ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లులపై చర్చ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**
మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించితీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ



బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాత పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, మహిళా రిజర్వేషన్ చట్టం సత్వర అమలు వంటి కీలక బిల్లుల కోసం మూడురోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయని, ఈ విషయాన్ని విపక్షాలకు ప్రభుత్వం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ కోటా అమలు బిల్లుపై, జనగణనతో నియోజకవర్గాల పునర్విభజనకు ఉన్న లంకెను విడదీయడంపై విపక్షంతో ప్రభుత్వం లోపాయికారీ సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్‌ల)కు ఒకే విధమైన ఉద్యోగ నిబంధనలు ఉండేందుకు ప్రతిపాదించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభ ఆమోదించి పంపిన ఈ బిల్లును లోక్‌సభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది.

# పెళ్లి కోసం బరువు తగ్గే ఇంజెక్షన్లు..

## భారత్‌లో కొత్త ట్రెండ్

**ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**
పెళ్లి రోజున నాజూగ్గా, అందంగా కనిపించాలనే ఆశ ప్రతి వధువుకూ ఉంటుంది. ఈ ఆశే ఇప్పుడు భారతదేశంలో ఒక కొత్త ట్రెండ్‌కు దారితీస్తోంది. పెళ్లికి ముందు వేగంగా బరువు తగ్గేందుకు కాబోయే వధూవరులు 'మౌంజారో' వంటి బరువు తగ్గించే ఇంజెక్షన్లను ఆశ్రయిస్తున్నారు.

న్యూఢిల్లీకి చెందిన 'క్లారిటీ స్కిన్ క్లినిక్' ఏకంగా "మౌంజారో బ్రైడ్" పేరుతో ప్రత్యేక ప్యాకేజీని ప్రచారం చేస్తోంది. మరికొన్ని క్లినిక్‌లు కూడా చర్మ, కేశ సంరక్షణతో పాటు ఈ ఇంజెక్షన్లను ప్రీ-వెడ్డింగ్ ప్యాకేజీల్లో చేర్చుతున్నాయి. ఎలి లిల్లీ సంస్థకు చెందిన మౌంజారో ఔషధం గురించి తమకు విచారణలు పెరిగాయని పలువురు వైద్యులు చెబుతున్నారు.

గత కొన్ని నెలలుగా ఊబకాయం తగ్గించే ఇంజెక్షన్ల కోసం వస్తున్న విచారణల్లో 20 శాతానికి పైగా కాబోయే వధువుల నుంచే వస్తున్నాయని ఢిల్లీకి చెందిన బారియాట్రిక్ సర్జన్ డాక్టర్ రజత్ గోయల్ తెలిపారు. వైద్యపరంగా అర్హత ఉన్నవారికే తాము ఈ మందులను సూచిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.






వ్యాయామం, డైటింగ్ చేసినా ఫలితం లేకపోవడంతో, ముంబైకి చెందిన 26 ఏళ్ల అదితి తన పెళ్లికి ముందు మౌంజారో వాడి 10 కిలోల బరువు తగ్గింది. పెళ్లి సమయంలో ఆత్మవిశ్వాసంతో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పింది. బరువు విషయంలో ఎదురయ్యే సామాజిక ఒత్తిడి కూడా చాలా మందిని ఈ వైపు నడిపిస్తోంది.

భారత్‌లో డయాబెటిస్, బరువు తగ్గడం కోసం అనుమతి పొందిన తొలి +న్రా-1 ఔషధం మౌంజారో. అయితే, వీటిని తక్షణ పరిష్కారంగా చూడవద్దని, కేవలం వైద్యుల పర్యవేక్షణలోనే వాడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఈ మందుల దుర్వినియోగం, అనధికార అమ్మకాలపై డ్రగ్ రెగ్యులేటర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

## భారత్ దాడులు చేస్తే బుద్ధి చెబుతామని హెచ్చరిక

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**



:పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# దొడ్డి కొమురయ్యకు కెసిఆర్ నివాళి

**హైదరాబాద్, ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.:**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘన నివాళి అర్పించారు. ప్రజా వ్యతిరేక పాలన మీద తెలంగాణ ప్రజల తిరుగుబాటుకు సంకేతంగా నిలిచిన కొమరయ్య గారి అమరత్వం, నాటి రాచరిక పాలకుల నుంచి నేటి ప్రజా వ్యతిరేక పాలకుల మీద సాగుతున్న ప్రజా పోరాటలకు స్ఫూర్తిగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అనంతరం పదేండ్లపాటు బాలారిష్టాలను అధిగమించి, స్వయం పాలనను దేశానికే ఆదర్శంగా నిలబెట్టుకోవడంలో అమరుల త్యాగాల స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ అన్నారు. తమ ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, రాజకీయ హక్కుల కోసం తెలంగాణ సబ్బండ కులాల పోరాటాన్ని పాలక ప్రభుత్వాలు గుర్తించి, రాజ్యాంగ పరమైన హక్కులను అందించగలిగిన నాడే, దొడ్డి కొమరయ్య వంటి ఎందరో తెలంగాణ అమరులు, త్యాగధనులకు నిజమైన ఘన నివాళి అర్పించినట్లవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

--------

# బైక్‌ను బలంగా ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

## ముగ్గురు యువకుల దుర్మరణం




**అనకాపల్లి, ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.** అనకాపల్లి జిల్లాలో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద రాత్రి 12 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు అనకాపల్లికి తరలిస్తుండగా చనిపోయారు. మృతి చెందిన ముగ్గురు యువకులు ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. మృతులు బంగారు నాని(24), గోవిందు (25) , పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బంగారి దుర్గాప్రసాద్(16)గా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు పెయింటింగ్ పనులు చేసుకోగా, మరో యువకుడు చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుల మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# ఆగివున్న లారీని ఢీకొన్న కారు

## ఇద్దరు అక్కడిక్కడే మృతి

**కరీంనగర్, ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**
జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ -పెద్దపల్లి బైపాస్‌లో బొమ్మకల్ ఫ్లై ఓవవర్ వద్ద ఆగివున్న లారీని ఓ కారు పక్క నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంలో కారు ఒకవైపు భాగం మొత్తం నుజ్జునుజ్జ అయ్యింది. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు.. మృతులను సయ్యద్ అబ్దుల్ రెహమాన్ (19), సయ్యద్ అతియాబ్ హుస్సేన్ (21)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఎండీ అదునాన్ తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఇక ఎండీ అబ్రార్ కారులో నుంచి దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడని పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

# గ్రూప్-1 నియామకాలపై సుప్రీం తీర్పు

## ఎక్స్ వేదికగా స్వాగతించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, ఏ ఏప్రిల్ 3 రిపబ్లిక్ న్యూస్.**తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. కొలువుల కోసం సంవత్సరాల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ -1 ఆశావహులకు ఇది పెద్ద ఊరటగా చెప్పుకొచ్చారు. ప్రజా ప్రభుత్వం వచ్చీ రావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ -1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని వెల్లడించారు. వారికి మరోసారి సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ట్వీట్ చేశారు.

# ధనుష్ సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటాడు
## : సంయుక్త మీనన్



మలయాళ చిత్ర పరిశ్రమ నుండి వచ్చి, టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'గోల్డెన్ లెగ్'గా గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి... సంయుక్త మీనన్. బింబిసార, విరూపాక్ష వంటి చిత్రాలతో తెలుగు పరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పవర్ స్టార్ పవన్ చిత్రం 'భీమ్లా నాయక్'తో సంయుక్త రేంజ్ నెక్ట్స్ లెవెల్ కి వెళ్లింది. తమిళనాడులో కూడా సంయుక్తకు భారీ ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... ధనుష్ సరసన 'సార్' (తమిళంలో వాతి) చిత్రంలో నటించిన అనుభవాన్ని ఆమె పంచుకుంది.

"ధనుష్ తో పనిచేయడం నాకు ఒక గొప్ప పాఠం లాంటిది. ఆయన సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటారు. కానీ కెమెరా ముందుకు రాగానే అద్భుతమైన శక్తిని ప్రదర్శిస్తారు. ఆయన కథను ఎంచుకున్నారంటే అందులో కచ్చితంగా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది" అని సంయుక్త ప్రశంసించింది.



భవిష్యత్తులో మళ్ళీ ఆయనతో కలిసి నటించాలనే కోరికను ఆమె వ్యక్తం చేసింది.

వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'సార్' చిత్రం విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇందులో మీనాక్షి అనే బోటనీ లెక్చరర్ పాత్రలో సంయుక్త ఒదిగిపోయింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథాబలమున్న సినిమాలను ఎంచుకోవడమే తన విజయ రహస్యమని ఆమె స్పష్టం చేసింది.




# యోధుడిగా సాయి దుర్గ తేజ్..
## ఆసక్తి రేపుతున్న కొత్త సినిమా కాన్సెప్ట్ పోస్టర్!

సుప్రీం హీరో, మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ తన కెరీర్‌లో 19వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. చూఖ19 అనే వర్కింగ్ టైటిల్‌తో రానున్న ఈ సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. యుగాల నాటి రహస్యాలు, ఊహకందని శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం ఉండబోతోందని స్పష్టమవుతోంది.విడుదలైన పోస్టర్‌లో సాయి తేజ్ ఒక దట్టమైన అటవీ ప్రాంతంలో శక్తివంతమైన యోధుడిలా నిలబడి ఆకాశం వైపు చూస్తూ కనిపించారు. ఆకాశంలో వింత మేఘాలు, ఒక రహస్య పర్వతం, కాంతి పుంజాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దీనికి 'యుగాల నాటి రహస్యాలు.. ఊహకు అందని అపరిమితమైన శక్తి' అనే క్యాప్షన్ జోడించడంతో ఇదొక మైథలాజికల్ టచ్ ఉన్న కాస్మిక్ అడ్వెంచర్ డ్రామా అని తెలుస్తోంది. ఇటీవల 'క' చిత్రంతో విజయం సాధించిన యువ దర్శకులు సుజిత్, సందీప్ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనున్నారు.


ఈ సినిమాతో సాయి తేజ్ నిర్మాతగా కూడా మారుతుండటం విశేషం. తన తల్లి పేరు మీద 'విజయదుర్గ ప్రొడక్షన్స్' అనే బ్యానర్‌ను స్థాపించి, ఈ చిత్రానికి నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. త్వరలోనే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.


## అద్దెకు స్వస్తి.. వాటా పద్ధతిలోకి
# సింగిల్ స్క్రీన్ థియేటర్లు



హైదరాబాద్‌లోని పలు సింగిల్ స్క్రీన్ థియేటర్లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటివరకు కొనసాగిన అద్దె విధానానికి స్వస్తి పలికి, మల్టీప్లెక్స్‌ల తరహాలో పర్సెంటేజీ విధానంలో సినిమాలను ప్రదర్శించాలని నిర్ణయించాయి. నగరంలోని మొత్తం 23 థియేటర్లలో శు క్రవారం నుంచే ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చినట్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఓ ప్రకటనలో తెలిపింది.ఇంతకాలం సినిమా ప్రదర్శన కోసం పంపిణీదారులు థియేటర్ల యాజమాన్యాలకు రోజువారీగా లేదా వారానికి ఇంత అని అద్దె చెల్లించేవారు. అయితే పెరిగిన నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీతాలతో ఈ విధానం భారంగా మారిందని, థియేటర్ల మనుగడ కష్టమవుతోందని యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే పర్సెంటేజీ విధానంలోకి మారాలని నిర్ణయించాయి.కొత్త విధానం ప్రకారం, సినిమా విడుదలైన మొదటి వారం వసూళ్లలో 60 శాతం, రెండో వారం 50 శాతం, మూడో వారం 40 శాతం చొప్పున వాటాను డిస్ట్రిబ్యూటర్లకు ఇవ్వనున్నారు. మిగిలిన వాటాను థియేటర్ యజమానులు తీసుకుంటారు. ప్రముఖ పంపిణీదారులు సునీల్ నారంగ్, శిరీష్ రెడ్డి వంటి వారు ఈ నిర్ణయానికి మద్దతు తెలిపారు. అయితే, మైత్రీ మూవీ మేకర్స్‌కు చెందిన పంపిణీదారు శశిధర్ రెడ్డి ఈ కొత్త నిబంధనలకు అంగీకరించలేదని సమాచారం.ప్రస్తుతానికి 23 థియేటర్లతో ప్రారంభమైన ఈ విధానాన్ని, భవిష్యత్తులో దశలవారీగా తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు విస్తరించనున్నట్లు ప్రదర్శనకారులు తెలిపినట్టు ఫిల్మ్ ఛాంబర్ తన ప్రకటనలో పేర్కొంది.

## సోషల్ మీడియా క్వీన్‌గా
# హెబ్బా సందడి





: సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, హెబ్బా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన రెగ్యులర్ అప్డేట్స్, వెకేషన్ ఫోటోలు మరియు గ్లామరస్ ఫోటోషూట్‌లను ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటూ ఉంటుంది. అందుకే ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయింగ్ కూడా భారీగానే ఉంది. తాజాగా చేసిన ఈ బోల్డ్ ఫోటోషూట్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించింది. ట్రెండీ అవుట్‌ఫిట్‌లను క్యారీ చేయడంలో తనకు సాటి ఎవరూ లేరని ఈ చిన్నది మరోసారి ప్రూవ్ చేసుకుందిప్రస్తుతం హెబ్బా పటేల్ కేవలం సినిమాలకే కాకుండా వెబ్ సిరీస్‌లపై కూడా దృష్టి పెడుతోంది. నటనకు స్కోప్ ఉన్న పాత్రలను ఎంచుకుంటూనే, అప్పుడప్పుడు స్పెషల్ సాంగ్స్‌లో మెరుస్తూ తన గ్లామర్ పవర్‌ను చూపిస్తోంది. కెరీర్ ఆరంభంలో వచ్చినంత సక్సెస్ ఇప్పుడు లేకపోయినప్పటికీ, తన క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని తాజాగా వైరల్ అవుతున్న ఫోటోలే సాక్ష్యం. భవిష్యత్తులో మరిన్ని విభిన్నమైన ప్రాజెక్టులతో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు హెబ్బా సిద్ధమవుతోంది. గ్లామర్ తో గెలుస్తున్న కుమారి: హెబ్బా పటేల్ తన బోల్డ్ లుక్స్‌తో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండటం కొత్తేమీ కాదు. కానీ ఈ సమ్మర్ లో ఆమె ఇస్తున్న స్టిల్స్ మాత్రం నెక్స్ట్ లెవల్‌లో ఉన్నాయి. తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఈ కుమారి రాబోయే సినిమాలతో బాక్సాఫీస్ వద్ద కూడా ఇలాగే అదరగొట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇక ఏది ఏమైనా, తన గ్లామర్ దాడితో హెబ్బా మరోసారి ఇంటర్నెట్ సెన్సేషన్ అయిపోయింది.

# మగవాళ్లకు ఒక రూల్.. ఆడవాళ్లకు ఒక రూలా?
## : సమాజంపై మంచు లక్ష్మి ఫైర్



ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు తనయగా కాకుండా, నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మంచు లక్ష్మి ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'ఆదిపర్వం', 'దక్ష' చిత్రాలతో అలరించిన ఆమె, మార్చి చివరి వారంలో 'లేచింది మహిళా లోకం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, మన సమాజం మహిళలను చూసే దృక్పథంపై నిప్పులు చెరిగారు.

సమాజం మహిళలను జడ్జ్ చేసే విధానాన్ని లక్ష్మి తప్పుబట్టారు. "మగవాళ్లు ఏదైనా బోల్డ్ నిర్ణయాలు తీసుకుంటే అది గొప్ప అని ప్రశంసిస్తారు. అదే ఆడవాళ్లు చేస్తే మాత్రం రకరకాలుగా మాట్లాడుకుంటారు. 'మేము చేస్తే సంసారం.. మీరు చేస్తే ఆ వ్యవహారం' అనే విధంగా ఉంటుంది. ఆ సామెతను నా నోటితో పూర్తిగా చెప్పను కానీ, మీకు అర్థమైందని అనుకుంటున్నాను" అని ఆమె చమత్కరిస్తూనే గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆడవాళ్లు ఇలాగే ఉండాలి, ఇలాగే ప్రవర్తించాలి అని రూల్స్ రాసింది ఎవరని ఆమె ప్రశ్నించారు.తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక ఆసక్తికర విషయాన్ని లక్ష్మి పంచుకున్నారు. "నా పెళ్లి సమయంలోనే నా భర్తకు ఒక మాట చెప్పాను. నువ్వు ఏ పని చేస్తావో.. అదే పని నేను కూడా చేయగలను అని గుర్తుంచుకోమన్నాను" అని తెలిపారు. తన మాటల ప్రభావమో ఏమో కానీ, తన భర్త ఏదైనా చేయడానికి జంకుతారని, తను చేస్తే లక్ష్మి కూడా చేస్తుందనే భయం ఆయన మనసులో ఉంటుందని ఆమె సరదాగా పేర్కొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన వసతులపై కలెక్టర్ దృష్టి

**ఎస్సీ, బీసీ హాస్టళ్ల పనితీరును మెరుగుపరచాలని ఆదేశం**

**విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సదుపాయాలు కల్పించాలి**

**హాస్టళ్లలో పారిశుద్ధ్యం, త్రాగునీరు, ఆహార నాణ్యతపై కఠిన పర్యవేక్షణ**

**జీరో వేస్ట్ లక్ష్యంతో హాస్టళ్లలో వ్యర్థాల నిర్వహణ బలోపేతం**

**సంక్షేమ వసతి గృహాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి**

**హాస్టళ్లలో మెనూ అమలు, వసతులపై నిరంతర తనిఖీలు అవసరం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరో ఏప్రిల్ 03 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల పనితీరును మరింత మెరుగుపరచి, విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంక్షేమ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలపై సంబంధిత సంక్షేమ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోషల్ వెల్ఫేర్ శాఖ పనితీరు తగిన స్థాయిలో ఉన్నప్పటికీ, బీసీ వెల్ఫేర్ శాఖ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందుతున్నదో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి హాస్టల్‌లో మెనూ వివరాలతో పెద్ద హోర్డింగ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంక్షేమ అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, హాస్టళ్లలో నివసిస్తున్న పేద విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆహార నాణ్యత, వార్డెన్ల పనితీరు, త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహించిన సమీక్షలో కొన్ని హాస్టళ్లు అత్యల్ప సానుకూలత సాధించగా, మరికొన్ని హాస్టళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు వెల్లడైందన్నారు. మంచి పనితీరు కనబరిచిన హాస్టళ్లను అభినందిస్తూ, తక్కువ పనితీరు కనబరిచిన హాస్టళ్ల వార్డెన్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, "జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్స్" లక్ష్యంతో ప్రతి హాస్టల్, ప్రభుత్వ సంస్థలో వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తడి చెత్తతో కంపోస్ట్ తయారీ, చెత్త వర్గీకరణ కోసం గ్రీన్, బ్లూ, రెడ్ బిన్‌ల ఏర్పాటు, పొడి చెత్త ద్వారా ఆదాయం సాధించడం వంటి చర్యలను తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు. హాస్టల్ ప్రాంగణాల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత, వార్డెన్ అందుబాటు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. హాస్టళ్లలో ఆర్.ఓ ప్లాంట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ సంక్షేమ వసతి గృహాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## కరుణామయుని త్యాగ పర్వం గుడ్ ఫ్రైడే



**నంద్యాల, ఏప్రిల్ 3, (రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదర సోదరీమణులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర దినం 'గుడ్ ఫ్రైడే'. మానవాళిని పాపాల నుంచి విముక్తులను చేయడానికి, లోక రక్షకుడైన యేసుక్రీస్తు తన ప్రాణాలను అర్పించిన త్యాగానికి చిహ్నమే గుడ్ ఫ్రైడే. క్రీస్తు శ్రమలను, ఆయన పడిన వేదనను, చివరిగా సిలువపై ఆయన పలికిన అమృత వాక్యాలను స్మరించుకుంటూ క్రైస్తవులు ఈ దినాన్ని అత్యంత నిష్ఠతో పాటిస్తారు. ఈ సందర్భంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని గాంధీనగర్ తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయంలో గుడ్ ఫ్రైడ్ ను ఘనంగా నిర్వహించడం జరిగింది. చర్చిలలో మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి యేసు సిలువపై పలికిన ఏడు మాటల గురించి నివారించారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. గుడ్ ఫ్రైడే కేవలం ఒక మతపరమైన ఆచారంగా మాత్రమే మిగిలిపోకూడదు. ఈరోజు మనకు క్షమించడం, ప్రేమించడం, పరోపకారం చేయడం అనే గొప్ప లక్షణాలను నేర్పిస్తుంది. ద్వేషాన్ని వీడి, తోటి మానవులను ప్రేమతో ఆదరించడమే యేసుక్రీస్తుకు మనం ఇచ్చే నిజమైన నివాళి. ఈ పవిత్ర దినాన అందరిలో శాంతి, సమాధానం, ఐక్యత వర్ధిల్లాలని కోరుకుందాని పాస్టర్ సందేశం ఇచ్చారు.



## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)"

**సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత**





**నంద్యాల క్రైం, ఏప్రిల్ 3, (రిపబ్లిక్ న్యూస్):** పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)" ను శుక్రవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు మరియు విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది వారి యొక్క సమస్యల గురించి ఎస్పీకి తెలియచేసినారు. జిల్లా ఎస్పీ గారు సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలిసికొని వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు.ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ,పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకోని పరిష్కరిస్తున్నామన్నారు. విధులలో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియజేశారు.

## ఐఎంఏ ఆధ్వర్యంలో అమరావతి చట్టబద్ధతపై వేడుకలు

**. మంత్రి ఫరూక్ కేక్ కట్ చేసి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు**

**. అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పించడం చారిత్రాత్మకం: మంత్రి ఫరూక్**

**అమరావతి రాజధాని చట్ట బద్ధత పై హర్షం వ్యక్తం చేసిన ఐఎంఏ వైద్యులు**



**నంద్యాల ఏప్రిల్ 3 (రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి కి పార్లమెంటులో చట్టబద్ధత చేసిన సందర్భంగా శుక్రవారం నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్.ఎమ్.డి. ఫరూక్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

మంత్రి ఫరూక్ వైద్యులతో కలిసి కేక్ కట్ చేశారు.ఐఎంఏ వైద్యులు మంత్రి ఫరూక్ ను సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు అమరావతి రాజధానిగా పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడంతోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అనుకూలమైన ప్రదేశంలో అమరావతి మహా నగరాన్ని నిర్మించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూనుకోవడం ఆయన దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. ఐఎంఏ వైద్యులు అమరావతి రాజధాని విషయంలో మద్దతు పలుకుతూ హర్షం వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు.

ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, బిజెపి నాయకులు డాక్టర్ ఇంటి ఆదినారాయణ, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ సునీత మాట్లాడుతూ ఏప్రిల్ 2 వ తేదీ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన చారిత్రాత్మక రోజుగా కలకాలం నిలిచిపోతుందని, ఆ దిశలో కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యామంత్రి నారా లోకేష్ లకు,పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీకి, పార్లమెంటులో మద్దతు తెలిపిన రాజకీయ పక్షాలన్నిటికీ వైద్యుల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ ఇంటి ఆదినారాయణ, డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ ,డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ పనిల్ కుమార్, మహిళా వైద్య విభాగం ప్రతినిధులు డాక్టర్ సునీత, డాక్టర్ హరిత, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ లలిత, డాక్టర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలకు పాల్పడిన ముద్దాయి అరెస్ట్

**రూ.15 లక్షల విలువచేసే బంగారు వెండి నగలతో పాటు నగదు స్వాధీనం**








**నంద్యాల క్రైం, ఏప్రిల్ 3, (రిపబ్లిక్ న్యూస్):** 2025 వ సంవత్సరము నుండి ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలలో అనగా నంద్యాల తాలూకా, బండిఆత్మకూరు, రేవనూరు,సంజామల, గడివేముల, బేతంచర్ల, అవుకు మొదలగు పోలీసు స్టేషన్ల పరిధులలో దొంగతనాలకు పాల్పడుతూన్న నేరస్తుల పై తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య, సీసీఎస్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ నిఘా ఉంచడం జరిగింది. శుక్రవారం నందమూరి నగర్ రోడ్, నాగులకట్ట దగ్గర ఉన్న టీ జంక్షను వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక వ్యక్తి నంబర్ ప్లేట్ లేని పల్సర్ మోటార్ సైకల్ వస్తు పోలీసు వారిని చూసి మోటార్ సైకల్ ను తిప్పుకొని పారిపోవుటకు ప్రయత్నించగా అతనిని పట్టుకొని విచారించడం జరిగింది. ఇతడు జల్సాలకు అలవాటుపడి పలు పోలీసు స్టేషన్ ల పరిధులలో దొంగతనాలు చేస్తూ తప్పించుకొని తిరుగుతు ఉండేవాడు. ముద్దాయి వద్ద నుండి 98 గ్రాముల బంగారు నగలను, 400 గ్రాముల వెండి వస్తువులను, 54,500/-నగదు, మొత్తం విలువ సుమారు 15 లక్షలు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

## వైభవంగా మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు







**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 3,( రిపబ్లిక్ న్యూస్ ):-** మండల పరిధిలోని భోజనం గ్రామంలో మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు వైభవంగా జరిగాయి. సరిగెత్తు వేడుకల్లో భాగంగా మౌలాలి స్వామి ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెల్లవారు జామున మౌలాలి స్వామిని మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య ఒకసారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత ఇదే రోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి సుమారు పది గంటల వరకు గ్రామోత్సవం కొనసాగించారు. ఈ వేడుకల్లో కులమతాలకు అతీతంగా పిల్లలు, పెద్దలు అందరూ పాల్గొని ఉత్సాహంగా గడిపారు. సరిగెత్తు వేడుకలు పురస్కరించుకొని తొలి రోజు గురువారం రాత్రి గ్రామంలోని ప్రతి ఒక్కరు వారి బంధువులతో కలిసి పీర్ల చావిడికి వెళ్ళి మౌలాలి స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారి మొక్కుబడికి అనుగుణంగా పూల సుస్కాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ యేట ఈ గ్రామంలో మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు గ్రామస్తులు ఆనవాయితీగా జరుపుకుంటారు. కాగా వేడుకలు పురస్కరించుకొని భోజనం గ్రామం ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో కలకలలాడింది. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన సూచికాలతో ముల్లసావులు మౌలాలి స్వామిని ప్రత్యేక అలంకరణ చేశారు. తర్వాత పలువురు భక్తులు మౌలాలి స్వామి ఆశీస్సులతో అగ్ని గుండంలో ప్రవేశించడం సరిగెత్తు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అగ్నిగుండ ప్రవేశ సమయంలో భక్తుల హర్షద్వానాలు, కేరింతలతో హోరెత్తించారు.భక్తులు నిప్పుల మీద నడవటమే వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే గ్రామోత్సవం అనంతరం మౌలాలి స్వామిని గ్రామ శివారులో ఉన్న కుందూ నదిలో ఖననం చేశారు. తర్వాత భక్తులతో ముల్లసావులు మౌలాలి స్వామి ప్రతిమలు నెత్తిన పెట్టుకొని బాధాతప్త హృదయాలతో ముస్లిం పాటలు పాడుతూ తిరిగి పీర్ల చావిడికి తీసుకువెళ్ళి భద్ర పరచడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ వేడుకల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై జగన్మోహన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com